

స్థానికంగా ఉండి సేవ చేస్తా

తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే స్థానికంగా ఉండి సేవచేస్తానని ఎల్లారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్‌రావు పేర్కొన్నారు.

- 11లో ▸



కేసీఆర్‌తో మరింత అభివృద్ధి

కేసీఆర్ కామారెడ్డిలో గెలిస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ పేర్కొన్నారు.

- 11లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.6 /15.8

ఉదయం పొగమంచు కురుస్తుంది. చలి గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'ఎస్‌ఎస్‌సీ పరీక్ష ఫీజు చెల్లించండి'

కామారెడ్డి టౌన్: ఎస్‌ఎస్‌సీ పబ్లిక్ పరీక్షల ఫీజును డిసెంబర్ 2వ తేదీలోగా చెల్లించాలని డీఈవో ఎస్.రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుము ద్వారా మూడు దశల్లో ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రూ.50 అపరాధ రుసుముతో డిసెంబర్ 12 వరకు, రూ.200 అపరాధ రుసుముతో 21వ తేదీ వరకు, రూ. 500 అపరాధ రుసుముతో జనవరి 1వ తేదీ వరకు ఫీజు చెల్లించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.

'శబరిమలకు ప్రత్యేక బస్సులు'



సదాశివనగర్: అయ్యప్ప దీక్ష తీసుకున్నవారి కోసం శబరిమలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు కామారెడ్డి ఆర్టీసీ డిపో సీఐ లింగమూర్తి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయం వద్ద బస్సు సర్వీసులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవాసమితి సభ్యులు హోటల్ రాజు, వీరారెడ్డి, ఆర్టీసీ కండక్టర్ రాజిరెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు నర్సింహారెడ్డి, మాజీ విండో చైర్మన్‌లు నారెడ్డి లింగారెడ్డి, జనగామ ప్రభాకర్‌రెడ్డి, కోతి లింగారెడ్డి, పోసాని భైరయ్య, కొప్పుల గంగారెడ్డి, ఆకుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'తనిఖీలకు సహకరించాలి'

కామారెడ్డి క్రైం: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయడం కోసం నిర్వహిస్తున్న తనిఖీలకు ప్రజలు సహకరించాలని ఎస్పీ సింధు శర్మ కోరారు. ప్రలోభాలకు అడ్డుకట్ట వేసే చర్యల్లో భాగంగా నగదు, మద్యం, కానుకల అక్రమ రవాణాకు చెక్ పెట్టేందుకు చెక్‌పోస్టులతోపాటు ఫ్లయింగ్ స్క్వాడ్, సర్వైలెన్స్ బృందాల ద్వారా 24 గంటలపాటు తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రాజకీయ నాయకుల వాహనాలతో సహా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని తెలిపారు.

నేటి నుంచి చెరుకు క్రషింగ్ ప్రారంభం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్ ఎల్లారెడ్డిలోని గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో గురువారం నుంచి చెరుకు క్రషింగ్ ప్రారంభమవుతుందని ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు తెలిపారు. ఉదయం 11 గంటలకు పూజలు చేసి క్రషింగ్‌ను ప్రారంభిస్తామని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న కేసీఆర్, వేదికపై ఎల్లారెడ్డి అభ్యర్థి సురేందర్, ఎంపీ బీబీ పాటిల్, జెడ్పీ చైర్‌పర్సన్ శోభ

కామారెడ్డి ఎల్లారెడ్డి రెండు కళ్ల లెక్క

- రెండు నియోజకవర్గాల అభివృద్ధి బాధ్యత నాదే
- రెండేళ్లలో ప్రతి మడికి సాగునీరందిస్తా
- నేనే పోటీ చేస్తున్న అనుకుని సురేందర్‌ను గెలిపించండ్రి
- ఎల్లారెడ్డి సభలో సీఎం కేసీఆర్

అద్భుతమైన ఆవిష్కరణ జరుగుతది

''కామారెడ్డి, ఎల్లారెడ్డి జంట నియోజకవర్గాలను ఏ రకంగా అభివృద్ధి చేస్తనో చెప్పను. చేసి చూపిస్త'' అని సీఎం కేసీఆర్ అన్నారు. అద్భుతమైన ఆవిష్కరణ జరుగుతుందన్నారు. గోదావరి జలాలతో పోచారం ప్రాజెక్టు ఏడాది పొడవునా నిండుకుండలా ఉండబోతోందన్నారు. రోడ్లు, మౌలిక సదుపాయాలు అన్నీ సమకూరుతాయన్నారు. సురేందర్‌ను భారీ మెజారిటీతో గెలిపిస్తే మీరు ఊహించనంత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.



సాక్షి, కామారెడ్డి/నాగిరెడ్డిపేట/ఎల్లారెడ్డి/ఎల్లారెడ్డి రూరల్: ''నేను కామారెడ్డిల పోటీజేస్తున్న. నాకు కామారెడ్డి, ఎల్లారెడ్డి రెండు కళ్ల లెక్క. రెండు నియోజకవర్గాల అభివృద్ధి నా బాధ్యత. రెండేళ్లలో ప్రతి మడికి సాగునీరందిస్తా. ఇక్కడ కూడా కేసీఆరే పోటీ చేస్తున్నడని అనుకుని సురేందర్‌కు ఓటు వేసి గెలిపించండి'' అని సీఎం కేసీఆర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం మధ్యాహ్నం ఎల్లారెడ్డి పట్టణంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. సురేందర్‌ను గెలిపిస్తే ఊహించనంత అభివృద్ధి జరుగుతుందన్నారు. మిషన్ కాకతీయ పథకాన్ని ఇదే నియోజకవర్గంలోని సదాశివనగర్ చెరువులో మొదలుపెట్టామని, తట్ట మోసి పనులు ప్రారంభించానని పేర్కొన్నారు. ఇక్కడ 4 వందల చెరువులు బాగు చేసుకున్నామని, అలాగే వాగుల మీద చెక్ డ్యాంలు కూడా కట్టుకున్నామని వివరించారు. చెరువులు బాగైన తర్వాత భూగర్భజలాలు పెరిగాయని, 24 గంటల కరెంటుతో వ్యవసాయానికి ఎంతో మేలు జరిగిందని పేర్కొన్నారు. తండాలను పంచాయతీలుగా చేసుకున్నామని, కాయితీ లంబాడీల సమస్య విషయంలోనూ కొట్లాడుతానని పేర్కొన్నారు.

తెలంగాణ ఉట్టిగ రాలే...

1969 లో నాలుగు వందల మందిని కాల్చిచంపిన కాంగ్రెస్ పాలకులు ఉద్యమాన్ని ప్రతిసారి అణిచివేసే ప్రయత్నమే చేశారని కేసీఆర్ ఆరోపించారు. గులాబీ జెండా ఊరూరా ఎగిరిన తర్వాత 2004 లో తెలంగాణ ఇస్తామని మనతో పొత్తు పెట్టుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో, దేశంలో అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ మాట తప్పడంతో ఉద్యమాన్ని మళ్ల మొదలుపెట్టి ముందుకు నడిచినమని, ఆ నడకలో ఎల్లారెడ్డి, కామారెడ్డి ప్రజలు పెద్ద ఎత్తున కదిలిండ్రని గుర్తు చేసుకున్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గానికి చెందిన విఠల్‌రెడ్డి అనే కళాకారుడు ఉద్యమంలో రాసి పాడిన పాటను కేసీఆర్ గుర్తు చేశారు. తెలంగాణ కోసం కాంగ్రెస్‌వాళ్లు ఒక్కరూ రాజీనామా చేయలేదని, అసెంబ్లీలో అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ఒక్క రూపాయి ఇవ్వనన్నా ఒక్కరూ నోరుమెదపలేదని విమర్శించారు. ఇప్పుడు తెలంగాణలో కాంగ్రెస్ రూపంలో పెద్ద ప్రమాదం పొంచి ఉందని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. వారు అధికారంలోకి వస్తే బతుకులు ఆగం అవుతాయని హెచ్చరించారు. సభలో పార్టీ నేతలు మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే జనార్దన్‌గౌడ్, జెడ్పీ చైర్మన్ దఫేదార్ శోభ రాజు, మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యం, జెడ్పీటీసీలు మనోహర్ రెడ్డి, ఉషాగౌడ్, ఎంపీపీ మాధవి, నాయకులు తానాజీరావ్, రాజేశ్వర్‌రావ్, శివాజీరావ్, ముకుందరావ్ పాల్గొన్నారు.

నిజాంసాగర్‌కు ఏడాదంతా నీళ్లు

బోధన్/నిజామాబాద్‌నాగారం: నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లో ఏడాదంతా నీళ్లుండేలా చూస్తామని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. బుధవారం బోధన్ పట్టణ శివారులోని నర్సాపూర్ శివారులో, నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభలలో సీఎం కేసీఆర్ పాల్గొన్నారు. ఆయా సభల్లో మాట్లాడుతూ బీడీ కార్మికుల జీవనభృతికి సంబంధించిన 2014 కటాఫ్‌ను తొలిగిస్తామని, బీడీ టేకేదార్లు, ప్యాకర్లకు పెన్షన్ అందిస్తామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం మోటార్లకు మీటర్లు పెట్టడానికి ప్రయత్నిస్తే తెలంగాణ ప్రభుత్వం తిరస్కరించిదన్నారు. నిధులివ్వని బీజేపీ నేతలు మీదగ్గరికొస్తే ప్రశ్నించాలన్నారు. పొరపాటున కాంగ్రెస్‌ను గెలిపిస్తే ధరణి పోర్టల్ బంగాళాఖాతానికి, రైతులు అరేబియా సముద్రంలోకి వెళ్లిపోయే ప్రమాదముందన్నారు. నిజామాబాద్ జిల్లాలో ఏ పార్టీ వస్తుందో ఆ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని, ప్రజలు బీఆర్‌ఎస్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు.



ఎల్లారెడ్డి సభలో పాల్గొన్న ప్రజలు

22వ ప్యాకేజీ పూర్తి చేయాలి



కాళేశ్వరం 22వ ప్యాకేజీ పనులను పూర్తి చేయాలని ఎల్లారెడ్డి బీఆర్‌ఎస్ అభ్యర్థి సురేందర్ సీఎం కేసీఆర్‌ను కోరారు. ఈ ప్యాకేజీ పూర్తయితే గాంధారి, తాడ్వాయి, సదాశివనగర్, రామారెడ్డి మండలాలకు సాగునీరు అందుతుందన్నారు. పోచారం ప్రాజెక్టులో 365 రోజులూ నిండుగా నీరుంటుందన్నారు. దీని వల్ల యాసంగిలో తలెత్తే 'ఏ' జోన్, 'బీ' జోన్ సమస్య తీరుతుందన్నారు. నాగిరెడ్డిపేట మండలంలో అసైన్‌మెంట్ భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు.

సీఎం కేసీఆర్ నోరు తెరిస్తే అబద్ధాలే..



రోడ్‌షోలో పాల్గొన్న జనం

- జుక్కల్ ఎమ్మెల్యే అవినీతికి అంతులేదు
- దళితబంధులో 50 శాతం కమీషన్లు..
- బిచ్కుంద సభలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్

నిజాంసాగర్/బిచ్కుంద: ''సీఎం కేసీఆర్ నోరు తెరిస్తే అబద్ధాలే. నవోదయ స్కూళ్లు, మెడికల్ కాలేజీలు ఒక్కటీ కేంద్రం ఇయ్యలేదట. ఈయన ప్రగతి భవన్‌ల, ఫామ్‌హౌజ్‌ల ఇరామ్ లేకుండా కష్టపడి తెచ్చిండట. మిస్టర్ కల్వకుంట్ల కమిషన్‌రావు.. ఫాం హౌజ్ నుంచి బయటకు వచ్చి చూడు.. కేంద్రం ఏమిచ్చిందో తెలుస్తది. భువనగిరి ఎయిమ్స్ ఇచ్చిందెవరు, 35 కేంద్రీయ, నవోదయ విద్యాలయాలు ఇచ్చిందెవరు? సైనిక్ స్కూల్ మంజూరు చేసిందెవరు? కేసీఆర్ ఝూటా కోర్.. బడా చోర్'' అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ ధ్వజమెత్తారు. బుధవారం బిచ్కుందలో బీజేపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బండి సంజయ్ హెలీకాప్టర్ ద్వారా బిచ్కుంద మండలంలోని పత్లాపూర్‌కు చేరుకుని, అక్కడినుంచి బిచ్కుంద బస్టాండ్ వరకు బీజేపీ శ్రేణులు నిర్వహించిన భారీ బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బస్టాండ్ చౌరస్తాలో ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి పసుపు బోర్డు ప్రకటించడం, ఎస్సీ వర్గీకరణకు కమిటీ వేస్తామని చెప్పడం, అధికారంలోకి వస్తే బీసీని సీఎం చేస్తామనడంతో సీఎం కేసీఆర్‌కు నిద్ర పడుతలేదన్నారు. అందుకే బీజేపీ మీద అబద్ధాల దాడి మొదలు పెట్టాడని విమర్శించారు. మోటార్లకు మీటర్లు పెడితే విద్యుత్ కొనుగోళ్ల పేరిట ఎంత దోచుకున్నారో బయటపడుతుందన్న భయంతో సీఎం ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. బీజేపీని గెలిపించాలని ప్రజలను కోరారు.

షెడ్యూల్ ప్రకారం బండి సంజయ్ పత్లాపూర్ హనుమాన్ ఆలయంలో పూజలు చేయాల్సి ఉంది. అయితే ఆయన హెలీప్యాడ్‌నుంచి నేరుగా బిచ్కుందకు వెళ్లారు. సభా వేదిక వద్దకు వెళ్లకుండా బిచ్కుంద బస్టాండ్ చౌరస్తాలోనే మాట్లాడారు. దీంతో వేదిక వద్ద వేచి ఉన్న బీజేపీ కార్యకర్తలు నిరాశచెందారు. బీజేపీ జుక్కల్ నియోజకవర్గ అభ్యర్థి అరుణతార, బీజేపీ నాయకులు రాములు సేట్, గోలి స్వరూప, మేకల నరేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బండి సంజయ్ అభ్యర్థి అరుణతార..



బైక్ ర్యాలీలో పాల్గొన్న బీజేపీ కార్యకర్తలు

జుక్కల్‌ను చూస్తే దుఃఖమొస్తోంది

జుక్కల్ నియోజకవర్గాన్ని చూస్తే దుఃఖమొస్తోందని బండి సంజయ్ పేర్కొన్నారు. ''ఎటూ చూసినా అధ్వానమైన రోడ్లు.. తాగడానికి మంచినీళ్లు లేవు.. చీకటి పడితే బస్సులు రావు.. మార్కెట్ యార్డు లేదు. పేదలకు ఇళ్లు లేవు.. బతకడానికి పనుల్లేవు.. అసలు మనం తెలంగాణలోనే ఉన్నామా అనిపిస్తోంది. కేసీఆర్ చెప్పిన బంగారు తెలంగాణ ఇదేనా?'' అని సంజయ్ ప్రశ్నించారు. దళిత బంధులో 50 శాతం కమీషన్ తీసుకుంటున్నారని దళితులు బాధపడుతున్నారన్నారు. అధికార పార్టీ నేతలు ఇసుక దందాతో వందల కోట్లు ఎనకేసుకుంటున్నారని, అడ్డుకునోళ్లపై కేసులు పెట్టి తంతున్నారని ఆరోపించారు. సిట్టింగ్ ఎమ్మె ల్యే అవినీతిపరుడని, మళ్లీ గెలిపిస్తే మీ బతుకులు ఖతమేనని పేర్కొన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువ పునరుద్ధరణ పనులను ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా చేస్తామని, లెండి ప్రాజెక్టును పూర్తి చేస్తామని మాటలు చెప్పిన కేసీఆర్.. వాటిని గాలికి వదిలేశారన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే జుక్కల్‌లో పేదలందరికీ ఇళ్లు కట్టిస్తామని, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం అందేలా చూస్తామని, కేసీఆర్ లెక్క ఇంటికొకరికి కాకుండా అర్హులందరికీ వృద్ధాప్య పెన్షన్ అందిస్తామని హామీ ఇచ్చారు.

ప్రతి ఒక్కరూ రేవంత్‌రెడ్డి అనుకోండి

- నేను రాష్ట్రమంతటా తిరగాల్సి ఉంటది
- పార్టీ గెలుపు కోసం శ్రమించండి
- కాంగ్రెస్ కేడర్‌కు దిశానిర్దేశం చేసిన పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి



మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి, వేదికపై షబ్బీర్ అలీ, యూసుఫ్ అలీ, ఈరవత్రి అనిల్

సాక్షి, కామారెడ్డి: ''పీసీసీ అధ్యక్షుడిగా రాష్ట్రమంతా తిరగాల్సి ఉంటుంది. ఒత్తిడి ఉన్నా అవకాశం దొరికినప్పుడల్లా వస్తా. ఒక్కొక్కరు ఒక్కో రేవంత్‌రెడ్డి అనుకుని గడపగడపకు వెళ్లండి. కచ్చితంగా విజయం మనదే. నిజామాబాద్‌లో షబ్బీర్‌అలీ కూడా గెలుస్తాడు. ఇద్దరం మీకు అండగా ఉంటాం'' అని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఉదయం కామారెడ్డిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఎవరి పోలింగ్‌బూత్ పరిధిలో వారు పనిచేసి, ఎక్కువ ఓట్లు తీసుకురావడానికి పోటీ పడాలన్నారు. అత్యధిక ఓట్లు తెచ్చిన బూత్ మెంబర్లతో కలిసి ఫొటో దిగడంతో పాటు వారితో కలిసి భోజనం చేస్తానన్నారు. కేసీఆర్ పాలనలో కాంగ్రెస్ కార్యకర్తలు ఎన్నో కష్టాలు పడ్డారని, అక్రమ కేసులతోపాటు జైళ్ల పాలయ్యారని పేర్కొన్నారు. ఈసారి మనం గెలిచి కేసీఆర్‌నుంచి మిత్తితో సహా వసూల్ చేద్దామన్నారు.

బీఆర్‌ఎస్ కుట్రలను తిప్పికొట్టండి

కేసీఆర్ మిడతల దండు, దండుపాళ్యం ముఠా, కాలకేయ ముఠాలకు బుద్ధి చెప్పాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. అబద్ధాలను నిజాలుగా ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ కుట్రలను తిప్పికొట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఇంటింటికీ వెళ్లి వాస్తవాలు వివరించాలని, ఆరు గ్యారంటీలపై ప్రజలకు అవగాహన కల్పించి వచ్చే నెలలో మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే అవన్నీ చేస్తామన్న భరోసా ఇవ్వాలని కోరారు. సోనియాగాంధీ నేతృత్వంలో దివంగత సీఎం వైఎస్సార్, విద్యుత్ శాఖ మంత్రి షబ్బీర్ అలీలు రైతు లకు ఉచిత విద్యుత్ అందించారన్నారు. ప్రాణహిత -చేవెళ్ల ప్రాజెక్టుకు వైఎస్సార్ కామారెడ్డిలో శంకుస్థాపన చేశారని, ఆ ప్రాజెక్టును సీఎం కేసీఆర్ మూలన పడేసి ఈ ప్రాంత ప్రజలకు అన్యాయం చేశారన్న విషయాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 24 గంటల పాటు నాణ్యమైన కరెంటు ఇస్తుందని, ఇళ్లకు 2 వందల యూనిట్ల ఉచిత విద్యుత్, ఐదు వందలకు గ్యాస్ సిలిండర్ ఇస్తుందన్న విషయాన్ని తెలపాలన్నారు. అప్పుడు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని, ఇప్పుడు ఇల్లు లేని వారికి ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇస్తామని పేర్కొన్నారు. మైనారిటీలకు నాలుగు శాతం రిజర్వేషన్లు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని, 12 శాతం ఇస్తానని మోసం చేసింది మాత్రం కేసీఆర్ అన్న విషయాన్ని ముస్లిం సమాజం గుర్తించాలన్నారు. ఇందిరమ్మ రాజ్యం వస్తుందని, అందరి కష్టాలు తీరుతాయని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ మంత్రి షబ్బీర్ అలీ, మాజీ ఎమ్మెల్యేలు యూసుఫ్ అలీ, ఈరవత్రి అనిల్, వేం నరేందర్‌రెడ్డి, నాయకులు అరికెల నర్సారెడ్డి, మానాల మోహన్‌రెడ్డి, కైలాస్ శ్రీనివాస్‌రావ్, నేరెళ్ల శారద, చంద్రకాంత్‌రెడ్డి, గూడెం శ్రీనివాస్‌రెడ్డి, పండ్ల రాజు, సందీప్, గణేశ్‌నాయక్, ఇంద్రకరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తేలిన అభ్యర్థుల లెక్క

- ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ గడువు
- కామారెడ్డి బరిలో అత్యధికంగా 39 మంది
- బాన్సువాడలో అత్యల్పంగా ఏడుగురు..



కామారెడ్డి క్రైం: నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం బుధవారంతో ముగిసింది. దీంతో బరిలో మిగిలిన అభ్యర్థుల లెక్క తేలింది. కామారెడ్డి బరిలో అత్యధికంగా 39 మంది అభ్యర్థులు ఉండగా.. జుక్కల్‌లో 17 మంది, ఎల్లారెడ్డిలో 11 మంది, బాన్సువాడలో ఏడుగురు అభ్యర్థులున్నారు.

జుక్కల్‌లో 17 మంది..

మద్నూర్: జుక్కల్ అసెంబ్లీ స్థానానికి 28 మంది నామినేషన్లు వేయగా.. నలుగురి దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. బుధవారం మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారాంతోపాటు మరో ఆరుగురు తప్పుకోవడంతో బరిలో 17 మంది మిగిలారు. బీఆర్‌ఎస్‌నుంచి హన్మంత్‌సింధే, కాంగ్రెస్‌నుంచి లక్ష్మీకాంతరావ్, బీజేపీనుంచి అరుణతార, బీఎస్పీనుంచి ప్రజ్ఞాకుమార్ బరిలో ఉన్నారు.

ఎల్లారెడ్డిలో 11మంది..

నాగిరెడ్డిపేట: ఎల్లారెడ్డిలో 16 నామినేషన్లు దాఖలు కాగా.. రెండు తిరస్కరణకు గురయ్యాయి. బుధవారం ముగ్గురు స్వతంత్రులు పోటీ నుంచి వైదొలగారు. దీంతో పోటీలో 11 మంది మిగిలారు. బీఆర్‌ఎస్ తరఫున జాజాల సురేందర్, కాంగ్రెస్‌నుంచి మదన్‌మోహన్‌రావు, బీజేపీ నుంచి సుభాష్ రెడ్డి, బీఎస్పీ నుంచి జమునా రాథోడ్ బరిలో ఉన్నారు.

బాన్సువాడలో ఏడుగురు..

బాన్సువాడ: బాన్సువాడలో 19 మంది నామినేషన్లు వేయగా ఇద్దరి నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. కాంగ్రెస్ నేత కాసుల బాల్‌రాజ్, స్వతంత్రఅభ్యర్థి పోచారం భాస్కర్‌రెడ్డితోపాటు పది మంది నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. బరిలో ఏడుగురు అభ్యర్థులున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి ఏనుగు రవీందర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి యెండల లక్ష్మీనారాయణ, బీఎస్పీ అభ్యర్థి నీరడి ఈశ్వర్ ప్రధాన అభ్యర్థులుగా ఉన్నారు.

కామారెడ్డి బరిలో 39 మంది..

కామారెడ్డి నియోజకవర్గంలో 64 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా వాటిలో ఆరు తిరస్కరణకు గురయ్యాయి. బుధవారం 19 మంది స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్‌లను ఉపసంహరించుకోవడంతో 39 మంది పోటీలో మిగిలారు. ప్రధాన పార్టీలలో బీఆర్‌ఎస్‌నుంచి కేసీఆర్, కాంగ్రెస్‌నుంచి రేవంత్‌రెడ్డి, బీజేపీనుంచి వెంకటరమణారెడ్డి బరిలో ఉన్నారు.

'ఎన్నికల బృందాలు చురుగ్గా పనిచేయాలి'

కామారెడ్డి క్రైం: స్టాటిస్టిక్ సర్వైలెన్స్ బృందాలు చురుగ్గా పనిచేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. బుధవారం నిజాంసాగర్ రోడ్‌లోని చెక్‌పోస్ట్ వద్ద సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పెద్ద మొత్తంలో అక్రమంగా నగదు, మద్యం, కానుకలు, వస్తువులు తరలించే అవకాశం ఉంటుందన్నారు. వాటిని గుర్తించి స్వాధీనం చేసుకోవాలన్నారు. బృందాల పనితీరుపై కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షణ ఉంటుందన్నారు. నియమావళి ఉల్లంఘనల సమాచారాన్ని సంబంధిత నోడల్ అధికారులకు తెలియజేయాలని సూచించారు.



నిజాంసాగర్ రోడ్‌లోని చెక్‌పోస్ట్ వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

'ఎన్నికల పరిశీలకులకు ఫిర్యాదు చేయొచ్చు'

కామారెడ్డి క్రైం: ఎన్నికలకు సంబంధించిన ఎలాంటి అంశాలనైనా ఎన్నికల సాధారణ పరిశీలకుల దృష్టికి తీసుకువెళ్లవచ్చని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. ఈ విషయమై ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కామారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల సాధారణ పరిశీలకుడు చిపంగ్ అర్థర్ వర్చాయియో, ఎల్లారెడ్డి నియోజకవర్గ సాధారణ పరిశీలకుడు జి.జగదీష కలెక్టరేట్‌లోని మొదటి అంతస్తులోగల 101 గదిలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు అన్ని పనిదినాలలో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. నేరుగా కలెక్టరేట్‌కు రాలేని కామారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల ఓటర్లు 63041 08748 నంబరుకు, ఎల్లారెడ్డి ఓటర్లు 81437 79448 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

క్లుప్తంగా

మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు



కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లాకు చెందిన పలు పార్టీల నాయకులు మంత్రి కేటీఆర్ సమక్షంలో బుధవారం సిరిసిల్ల జిల్లాలో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బహుజన లెఫ్ట్ ఫ్రంట్ పార్టీ నేత డాక్టర్ పుట్ట మల్లికార్జున్, వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ మీర్ హిదాయత్ అలీ, మైనార్టీ అధ్యక్షుడు మహ్మద్ మొయిజుల్లా, లారీ ఓనర్స్ జిల్లా అధ్యక్షుడు ఎజాజ్‌ఖాన్, నాయకులు మహమ్మద్ నజీర్, సాజిదుల్లా, జావీద్, శ్రీనివాస్, సంతోష్‌లో బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దిన్ తదితరులున్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశానికి గురువారం నుంచి ధర్మారావ్‌పేట్ ఉన్నత పాఠశాలలో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కో–ఆర్డినేటర్ దయానంద్ తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9642688577, 9959929739లను సంప్రదించాలన్నారు.

ఎన్నికల అంశాలపై ఫిర్యాదు చేయొచ్చు

సుభాష్‌నగర్: బోధన్, బాన్సువాడ నియోజకవర్గాల ఎన్నికలకు సంబంధించిన ఎలాంటి అంశమైనా తనకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చని ఎన్నికల సాధారణ పరిశీలకులు లలిత్ నారాయణ్ సింగ్ సందు ఒక ప్రకటనలో తెలిపారు. పై రెండు సెగ్మెంట్లలో ఎన్నికలతో ముడిపడిన ఏ విషయమైనా తన దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. సెలవు దినాల్లో మినహాయించి మిగతా అన్నిరోజుల్లో బోధన్ ఇరిగేషన్ అతిథి గృహంలో అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. నేరుగా కలిసేందుకు వీలుపడని వారు 8332021758 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదులు చేయొచ్చని తెలిపారు.

జిల్లా జైలులో వైద్య శిబిరం



నిజామాబాద్‌నాగారం: జిల్లా జైలులో వైద్య, ఆరోగ్య శాఖ, సాతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఖైదీలకు బుధవారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. జైలు సూపరింటెండెంట్ ప్రమోద్, డీఎంహెచ్‌వో సుదర్శనం మాట్లాడుతూ ఖైదీల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించామన్నారు. ఖైదీలతోపాటు పోలీస్ సిబ్బంది కూడా పరీక్షలు చేసుకున్నారు. అనిల్ కుమార్, ఎయిడ్స్ కోఆర్డినేటర్ సుధాకర్, జిల్లా టీబీ కోఆర్డినేటర్ రవిగౌడ్, టెక్నీషియన్స్ వేణు, శ్రావణ్, రవి పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ



డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను డీఈవో దుర్గా ప్రసాద్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల బోధన, విద్యార్థుల ప్రగతి, హాజరుతోపాటు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న నూత్‌పల్లి గ్రామానికి చెందిన ఆకాంక్షకు ఇటీవల గుండె ఆపరేషన్ కాగా, తోటి విద్యార్థులు సేకరించిన రూ.1,35,600 విరాళాన్ని ఆమెకు అందజేశారు.

ఒకరి అదృశ్యం

ఖలీల్‌వాడి:నగరంలోని ఆర్యనగర్‌కు చెందిన శివారత్ శివకుమార్(32) అదృశ్యమైనట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. దుబాయ్‌లో ఇంజినీర్‌గా పని చేసే శివకుమార్ ఇటీవల ఇంటికి వచ్చాడు. మంగళవారం ఉదయం 9 గంటలకు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆయన తల్లి విజయ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కాంగ్రెస్‌కు తప్పిన రెబల్స్ బెడద

- అధిష్టానం చొరవతో పోటీ నుంచి విరమణ
- ఊపిరి పీల్చుకున్న పార్టీ అభ్యర్థులు



రవీందర్‌రెడ్డిని సన్మానిస్తున్న కాసుల బాల్‌రాజ్

సాక్షి, కామారెడ్డి: టికెట్టు రాలేదన్న అసంతృప్తితో తిరుగుబాటు జెండా ఎగురవేసిన కాంగ్రెస్ సీనియర్ నేతలు.. ఆ పార్టీ అధిష్టానం చొరవతో నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీకి రెబల్స్ బెడద తప్పింది. కామారెడ్డిలో కాంగ్రెస్ అభ్యర్థిగా పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. ఇక్కడ ఏ సమస్యా లేదు. ఎల్లారెడ్డిలో టికెట్టు ఆశించి భంగపడిన సుభాష్‌రెడ్డి బీజేపీలో చేరి ఆ పార్టీ నుంచి బరిలో నిలిచారు. బాన్సువాడ టికెట్టు కోసం చివరిదాకా ప్రయత్నించిన కాసుల బాల్‌రాజ్.. అభ్యర్థిత్వం దక్కకపోవడంతో తిరుగుబాటు చేసి, నామినేషన్ వేశారు. అంతేకాక అభ్యర్థిని మార్చాల్సిందేనంటూ దీక్షకు దిగి, పురుగుల మందు సేవించి ఆస్పత్రి పాలయ్యారు. కాంగ్రెస్ అధిష్టానం పంపిన దూతలు బుధవారం ఆయనను కలిసి బుజ్జగించారు. దీంతో ఆయన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. అలాగే జుక్కల్ టికెట్టు ఆశించి నిరాశకు గురైన మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారాం సైతం రెబల్‌గా నామినేషన్ వేశారు. నామినేషన్ల ఉపసంహరణకు చివరిరోజు కాంగ్రెస్ సీనియర్ నేతలు ఆయనను సంప్రదించారు. దీంతో ఆయన బుధవారం నామినేషన్ ఉపసంహరించుకున్నారు. రెండుచోట్ల రెబల్స్ పోటీనుంచి తప్పుకోవడంతో కాంగ్రెస్ శ్రేణులు ఊపిరిపీల్చుకున్నాయి.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

బాన్సువాడ: తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ఏఐసీసీ కార్యదర్శి కార్యదర్శి పేర్కొన్నారు. బుధవారం బాన్సువాడలో కాసుల బాల్‌రాజ్ ఇంట్లో విలేకరులతో మాట్లాడారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీల ఆదేశాల మేరకు జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ రెబల్ అభ్యర్థులుగా నామినేషన్ వేసిన నాయకులతో మాట్లాడేందుకు వచ్చామన్నారు. కాసుల బాల్‌రాజ్‌ను అధిష్టానం ఢిల్లీకి తీసుకురావాలని సూచించిందని పేర్కొన్నారు. అధికారంలోకి రాగానే ఆయనకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. బాన్సువాడలో పదేళ్లు కాంగ్రెస్ పార్టీ కోసం పని చేశానని, టికెట్టు రాకపోవడంతో మనస్తాపం చెందానని కాసుల బాల్‌రాజ్ పేర్కొన్నారు. అధిష్టానం ఆదేశాలతో నామినేషన్ ఉపసంహరించుకున్నానన్నారు. సమావేశంలో పార్టీ అభ్యర్థి ఏనుగు రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి చేశాను.. ఆశీర్వదించండి

- బాన్సువాడ బీఆర్ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి



పోతంగల్‌లో మాట్లాడుతున్న బాన్సువాడ బీఆర్ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి

రుద్రూర్: బాన్సువాడ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానని, మరింత అభివృద్ధి కోసం మళ్లీ గెలిపించాలని స్పీకర్, బాన్సువాడ బీఆర్ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. పోతంగల్ మండలం బర్దీపూర్ తండా, కల్లూర్, కొడిచర్ల, పోతంగల్, హంగర్గా, జల్లాపల్లి ఫారం, జల్లాపల్లి గ్రామాల్లో బుధవారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఆయనకు ఘన స్వాగతం పలికారు. బర్దీపూర్ తండా వాసులు శ్రీనివాస్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు ప్రకటించి ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని అందజేశారు. కల్లూర్, పోతంగల్‌లో పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. ఆయా గ్రామాల్లో పోచారం మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీ నుంచి స్థానికేతరులు పోటీ చేస్తూ మభ్యపెట్టె మాటలు చెబుతున్నారని, వాటిని నమ్మి మోసపోవద్దన్నారు. ఎన్నికలు కాగానే ఒకరు ఎల్లారెడ్డికి, మరొకరు నిజామాబాద్‌కు వెళ్లిపోతారని, తాను మాత్రం ప్రజలతోనే ఉండి సమస్యలు పరిష్కరిస్తానని పేర్కొన్నారు. ఇప్పటి వరకు గ్రామాల వారీగా చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు దేశంలో ఏ రాష్ట్రంలో కూడా లేవన్నారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎజాజ్‌ఖాన్, జెడ్పీటీసీ శంకర్‌పటేల్, వైస్ ఎంపీపీ గంగాధర్ పటేల్, ఏఎంసీ వైస్ చైర్మన్ రామిరెడ్డి, సిరాజ్ పాల్గొన్నారు.



కొడిచర్లలో స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

యువత కోసం ప్రతి ఏటా జాబ్ మేళా



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి

- యువ ఆత్మీయ సమ్మేళనంలో డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి

బాన్సువాడ: బాన్సువాడ నియోజకవర్గ యువత కోసం ప్రతి ఏటా జాబ్ మేళాను నిర్వహిస్తామని డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి అన్నారు. బాన్సువాడలో బుధవారం బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాలకు చెందిన యువతతో యువ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాన్సువాడలో రెండు సార్లు ఉచిత కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేశామని, కోచింగ్‌కు హాజరైన చాలా మందికి ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చాయని అన్నారు. సెప్టెంబర్‌లో నిరుద్యోగుల కోసం జాబ్ మేళా నిర్వహించగా అందులో 1,411 మందికి ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. బాన్సువాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత పోచారం శ్రీనివాస్‌రెడ్డికే దక్కిందన్నారు. శీనన్నకు ఇవే చివరి ఎన్నికలు కాబట్టి ఈ ఎన్నికల్లో లక్ష మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రతి పక్షాల పార్టీలకు చెందిన అభ్యర్థులను వారు ఎక్కడి నుంచి వచ్చారో అక్కడికే పంపించాలన్నారు.అనంతరం పోచారం శ్రీనివాస్‌రెడ్డి తనయులు పోచారం రవీందర్‌రెడ్డి, పోచారం భాస్కర్‌రెడ్డిలు స్టేజీపై డ్యాన్సులు చేసి యువకులను ఉత్రూతలూగించారు. నాయకులు ప్రశాంత్, యునుస్, శశికాంత్, భాను, ద్రోణవల్లి సతీష్, అంజిరెడ్డి, జంగం గంగాధర్, మోహన్ నాయక్, పాత బాలకృష్ణ, గోపాల్‌రెడ్డి, పిట్ల శ్రీధర్, తదితరులు ఉన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న డీఈవో దుర్గాప్రసాద్

మోపాల్(నిజామాబాద్‌రూరల్) : చదువులో వెనకబడిన విద్యార్థులపై హెచ్‌ఎంలు ప్రత్యేక దృష్టి సారించాలని డీఈవో దుర్గాప్రసాద్ సూచించారు. బుధవారం నగరశివారులోని బోర్గాం(పి) జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్నతి, తొలిమెట్టు, లక్ష్య కార్యక్రమాలపై హెచ్‌ఎంలకు ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఉన్నతి, లక్ష్య కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. చదువులో వెనకబడిన విద్యార్థులపై అశ్రద్ధ వహించొద్దన్నారు. పదోతరగతి ఫలితాల్లో జిల్లాను ముందంజలో ఉంచాలని, అందుకు హెచ్‌ఎంలు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో బోర్గాం(పి) హెచ్‌ఎం శంకర్ పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



సెల్‌ఫోన్ రిపేర్ షాపు పెట్టుకున్న అరుణ్‌ను అభినందిస్తున్న ఎస్‌బీఐ రాష్ట్ర డైరెక్టర్

డిచ్‌పల్లి: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ) ఆధ్వర్యంలో ఇస్తున్న ఉచిత స్వయం ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఎస్‌బీఐ డైరెక్టర్ పి విశ్వనాథ్ రెడ్డి సూచించారు. బుధవారం డిచ్‌పల్లిలోని ఆర్‌ఎస్‌ఈటీఐను ఆయన సందర్శించి రిజిస్టర్లను తనిఖీ చేశారు. కేంద్రంలో శిక్షణ, వసతి సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం ఎలక్ట్రీషియన్ బ్యాచ్ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. మార్కెట్‌లో ఎలక్ట్రీషియన్, సీసీ టీవీ ఇన్‌స్టాలేషన్, రిపేరింగ్‌కు మంచి డిమాండ్ ఉందన్నారు. అభ్యర్థులు శిక్షణను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి ద్వారా జీవితంలో ఎదగాలని సూచించారు. ఆర్‌ఎస్‌ఈటీఐ, డిచ్‌పల్లిలో సెల్‌ఫోన్ రిపేరింగ్‌లో శిక్షణ పూర్తి చేసుకుని ధర్పల్లిలో సొంతంగా షాప్ పెట్టుకుని ఉపాధి పొందుతున్న అరుణ్‌ను విశ్వనాథ్‌రెడ్డి అభినందించారు. సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్, సిబ్బంది భాగ్యలక్ష్మి రామకృష్ణ, రంజిత్, నవీన్, రవి, రఘుదీప్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ పత్రికలో గుండారం విద్యార్థుల కవితలు



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

నిజామాబాద్‌రూరల్: కెనడా దేశం కేంద్రంగా వెలువడే అంతర్జాతీయ బాలల మాసపత్రిక 'గడుగ్గాయి'లో నిజామాబాద్ రూరల్ మండలం గుండారం ఉన్నత పాఠశాల విద్యార్థుల కవితలు ప్రచురితమయ్యాయి. తొమ్మిదో తరగతి విద్యార్థులు లాస్య, కృష్ణవేణి,శ్రుతిరెడ్డి రచించిన 'భరోసా','మన ఓటు', 'ఓటు విలువ' అనే కవితలు ప్రచురితమయ్యాయని హెచ్‌ఎం బి అమర్‌నాథ్ బుధవారం తెలిపారు. పాఠశాలలో జరిగిన సమావేశంలో విద్యార్థులను, తెలుగు ఉపాధ్యాయుడు కాసర్ల నరేశ్‌రావును ఆయన అభినందించారు. ఉపాధ్యాయులు అహల్య, శ్రీపాద్, గిరిధర్, ఆరోగ్యరాజ్, ప్రణీత, వినోద్ కుమార్, నాందేవ్, నవీనాకుమారి, పుష్పలత, బాలజయంతి, కవిత, మోనీశ్ పాల్గొన్నారు.



నిజామాబాద్ సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, చిత్రంలో ఎమ్మెల్యే బిగాల, రాజ్యసభ ఎంపీ సురేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత, మేయర్ నీతూకిరణ్

సీఎం సభతో జోష్

నిజామాబాద్ అర్బన్, బోధన్ నియోజకవర్గాల్లో సీఎం కేసీఆర్ సభలు విజయవంతం అయ్యాయి. సీఎం ప్రసంగంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నెలకొంది.



సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న బిగాల, సురేశ్‌రెడ్డి



బోధన్ సభలో సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ కవిత, జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు

ఉర్దూ విభాగంలో తన్వీర్‌కు పీహెచ్‌డీ



తన్వీర్‌ను అభినందిస్తున్న రిజిస్ట్రార్ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఉర్దూ విభాగం పరిశోధక విద్యార్థి మహమ్మద్ తన్వీర్ డాక్టరేట్ సాధించారు. తెయూ ఉర్దూ బీవోఎస్ చైర్మన్ మహమ్మద్ అబ్దుల్ ఖవి పర్యవేక్షణలో 'ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో సాంకేతిక పరిజ్ఞానం' అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథం సమర్పించారు. బుధవారం వైవాకు ఉస్మానియా యూనివర్సిటీ ఉర్దూ పూర్వ విభాగాధిపతి మొయిద్ జావీద్ ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. ఆర్ట్స్ డీన్ వి త్రివేణి, ప్రొఫెసర్ పి కనకయ్య, ఉర్దూ హెచ్‌వోడీ మూసా ఖురేషీ పాల్గొన్నారు. తన్వీర్‌ను రిజిస్ట్రార్ యాదగిరి అభినందించారు.

క్రైం కార్నర్

ఆలయంలో చోరీ

కామారెడ్డి క్రైం: కామారెడ్డిలోని అశోక్‌నగర్‌లో ఉన్న ఐదు గుడి ల ప్రాంగణంలో చోరీ జరిగింది. ఐదు గుడిల ప్రాంగణంలో గా యత్రీ మాత, శివాలయం , శ్రీ కృష్ణ, ఆంజనేయ, సాయిబాబా ఆలయాలు ఉన్నాయి. బుధవారం ఉదయాన్నే ఆలయానికి వచ్చిన భక్తులు గాయత్రి మాత, శ్రీకృష్ణ ఆలయాల తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పట్టణ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. క్లూస్ టీం బృందాలను రప్పించి ఆధారాలు సేకరించారు. మొదట పంచలోహ విగ్రహాలు చోరీకి గురయ్యా యని కాలనీలో ప్రచారం జరిగింది. పూజారి హరీశ్, ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ విలువైన వస్తువులను ఆలయంలో ఉంచలేదని తెలిపారు. ఒక ఆలయం నుంచి మాత్రం హుండీలోని చిల్లర నగదు చోరీకి గురైందని తెలిపారు. దగ్గరలో సీసీ కెమెరాలు లేకపోవడంతో దొంగల ఆచూకీ తెలియలేదు. విచారణ జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

మహిళ మెడలో నుంచి గొలుసు..

ఆర్మూర్ టౌన్: ఆర్మూర్‌లోని మల్లారెడ్డి చెరువు సమీపంలో ఓ మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తి బంగారు గొలుసును లాక్కెళ్లాడు. వివరాలు.. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం దుబ్బా గ్రామానికి చెందిన ఎల్లవ్వ ఆర్మూర్‌లోని అరుంధతి నగర్‌లో తన కూతురు ఇంటికి భర్తతో కలిసి టీవీఎస్ ఎక్సెల్‌పై వస్తోంది. ఆ సమయంలో వెనుక నుంచి బైక్‌పై వచ్చిన దొంగ ఎల్లవ్వ మెడలోని మూడు తులాల బంగారు గొలుసును లాక్కొని పారిపోయాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. మూడు నెలల వ్యవధిలో మల్లారెడ్డి చెరువు వద్ద మూడో సారి చైన్ స్నాచింగ్ జరిగింది.

కత్తెరతో తమ్ముడిపై దాడి

ఖలీల్‌వాడి: తమ్ముడిపై కత్తెరతో దాడి చేసి అనంతరం తను కూడా పొడుచుకున్న ఘటన నగరంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు.. నగరంలోని నాందేవ్‌వాడకు చెందిన హన్మంతు, భీమ్‌రావు అన్నదమ్ములు. హన్మంతు మద్యానికి బానిసై తరచు తమ్ముడు భీమ్‌రావును డబ్బులు అడిగేవాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం హన్మంతు భీమ్‌రావు ఇంటికి వచ్చాడు. ఇద్దరి మధ్య డబ్బుల కోసం వాగ్వాదం జరిగింది. దీంతో హనుమంతు, భీమ్‌రావును కత్తెరతో పొడిచాడు. దీంతో చుట్టూ పక్కల అక్కడి చేరుకున్నారు. అనంతరం హన్మంతు అదే కత్తెరతో తనకు తాను పొడుచుకున్నట్లు సమాచారం. స్థానికులు ఇద్దరిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ను వివరణ కోరగా అన్నదమ్ములు కత్తెరతో దాడి చేసుకున్నారని చెప్పారు.

తనిఖీల్లో నగదు స్వాధీనం



భిక్కనూరు: భిక్కనూరు సమీపంలో జాతీయ రహదారిపై వాహనాల తనిఖీలో బుధవారం రూ.2.90లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లికి చెందిన సాజీద్ వద్ద రూ.లక్ష పదివేలు, హైదరాబాద్‌కు చెందిన నిఖిల్ వద్ద రూ.1.80 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ధాన్యం బస్తాల లారీ బోల్తా



నిజాంసాగర్: మహమ్మద్‌నగర్ మండలం గాలీపూర్ మూలమలుపు వద్ద బుధవారం ధాన్యం బస్తాల లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా పడింది. మెదక్ జిల్లా నుంచి బోధన్ రైస్‌మిల్లుకు ధాన్యం బస్తాలను తీసుకు వెళ్తున్న లారీ మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహాన్ని తప్పించే క్రమంలో బోల్తా పడింది. దాంతో లారీలో ఉన్న ధాన్యం బస్తాలు రోడ్డు పక్కన పడిపోయాయి. బైక్ రోడ్డు పక్కకు కూరుకుపోవడంతో లారీ డ్రైవర్‌ను చితకబాదినట్లు తెలిసింది.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న డీఐఈవో

డిచ్‌పల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్–19 జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గురుకుల విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బి సంగీత తెలిపారు. ఇటీవల మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి హర్యాణలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు డి నవనీత, బి వర్ష ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను డీఐఈవో రఘురాజ్, గురుకుల ప్రిన్సిపాల్స్ సంగీత, రాగలత, ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ గంగాధర్, సోషల్ వెల్ఫేర్ స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ నీరజారెడ్డి, వాలీబాల్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ మల్లేష్ గౌడ్, పీడీ ఉదయశీల, పీఈటీలు జ్యోత్స్న, మానస, సుజాత అభినందించారు.

ఒకేషనల్ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు ఎక్కువ



ఖలీల్‌వాడి: ఇంటర్‌లో ఒకేషనల్ చదివిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని డీఐఈవో రఘురాజ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఒకేషనల్ గ్రూప్‌ల విద్యార్థులకు, మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్లకు, ల్యాబ్ టెక్నిషియన్, బాలుర కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు నిర్వహిస్తున్న ఆన్ ది జాబ్ ట్రైనింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆన్ ది జాబ్ ట్రైనింగ్ వరం లాంటిదని చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అధ్యాపకులు శ్రీనివాస్, భాస్కర్, రమణ, వెంకట్ రాజ్, కిరీట సుహాసిని, అస్మ కౌసర్ పాల్గొన్నారు.

కళాశాలలపై చర్యలు తీసుకోవాలి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు డిగ్రీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ బి శివ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తెయూ రిజిస్ట్రార్ యాదగిరికి వినతిపత్రం అందజేశారు. శివ మాట్లాడుతూ.. బయోమెట్రిక్ ఫీజు, సెమిస్టర్ ఫీజుల పేరిట వర్సిటీ నిర్ణయించిన ఫీజుల కంటే అధికంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దామ సునీల్, సాయి, ప్రమోద్, కన్న, మణికాంత్ పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

CHANGE OF NAME

■ I, RADHA KISHAN (OLD NAME) Mahalaxmi Nagar, Nizamabad. Hence Changed my Name as a AJJAN RADHA KISHAN (New Name) S/o. RAJAIAH. [Z-799648]

WANTED

■ షాప్ నందు బైక్ వున్న Boys పని చేయుటకు కావలెను రోజు వేతనము 400 C/o. లక్ష్మీ నరసింహా పెయింట్ షాప్, మానిక్ బండర్ చెక్క, ఆర్మూర్ రోడ్, నిజామాబాద్. [Z-1105073]

■ మా ఆఫీసు న్యూ బ్రాంచ్ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9177736926. [M-1221912]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 200/-రూ॥లు ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలిం చిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.